సాక్షి ఒడిశా

బుధవారం । 14 । ఫిబ్రవరి । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం మంగళవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,28,667లు,వెండి 95గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



గంజాంలో సీఎం నవీన్ పర్యటన నేడు

తాను ప్రాతినిథ్యం వహిస్తున్న గంజాం జిల్లాలో సీఎం నవీన్ పట్నాయక్ బుధవారం పర్యటించనున్నారు.

- 8లో



వినియోగదారులకు తీపి కబురు

రాష్ట్రంలో గృహ వినియోగదారులకు విద్యుత్ సరఫరా చార్జీలు తగ్గాయి.

.- 8లో

న్యూస్‌రీల్

నకిలీ మద్యం స్వాధీనం



అరెస్టైనవారిని చూపిస్తున్న పోలీసులు

బరంపురం: నగరానికి చెందిన ఎక్సైజ్ విభాగం నకిలీ మద్యంపై ఉక్కుపాదం మోపుతోంది. దీనిలో భాగంగా బరంపురం-ఛత్రపూర్ మధ్య రహదారి దగ్గర గ్రామంలో ఎక్సైజ్ అధికారులు ఆకస్మిక దాడులు చేపట్టి భారీగా నకిలీ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ కమిషనర్ దామోదర్ పండా తెలిపిన వివరాల మేరకు.. జిల్లాలోని చమ్మఖండి పోలీసుస్టేషన్ పరిధి బొనుగునాపల్లి గ్రామంలో ఒక కారులో అక్రమంగా మద్యం బాటిళ్లు తరిస్తున్న సమయంలో ఎక్సైజ్ అధికారులు దాడులు చేపట్టారు. దీనిలో భాగంగా 1,740 లీటర్ల నకిలీ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకోవడంతో పాటు ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. అరెస్టైనవారిలో జిల్లాకి చెందిన శంకర్ ప్రధాన్, సంజాయ్ ప్రధాన్, శిబశంకర్ కుటియాలు ఉన్నట్లు వెల్లడించారు.

చిరుత పులి చర్మం సీజ్



సీజ్ చేసిన పులిచర్మం

బరంపురం: జిల్లాలోని అటవీ శాఖ అధికారులు కళ్లికోట్ కన్నరియాబడి అటవీ ప్రాంతంలో చిరుత పులి చర్మం సీజ్ చేసిన ఘటన సంచలనంగా మారింది. జిల్లా అటవీ శాఖ అధికారి దామోదర్ పాలయి తెలిపిన వివరాల మేరకు.. మంగళవారం కళ్లికోట్ కన్నరియాబడి అటవీ ప్రాంతంలో ముందస్తు సమాచారంతో దాడిచేసి చిరుత పులి చర్మం సీజ్ చేశారు. అయితే ఎవరినీ అరెస్టు చేయకపోవడంపై స్థానికులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు వేయకుంటే ఎన్నికలు బహిష్కరిస్తాం



ర్యాలీగా కలెక్టరేట్‌కు వెళ్తున్న ప్రజలు

పర్లాకిమిడి: గజపతి జిల్లా ఆర్.ఉదయగిరి బ్లాక్ అనఘా పంచాయతీ నుంచి మూడు గ్రామాలకు తారురోడ్డు వేయాలని డిమాండ్ చేస్తూ తుబురు సింగి, బల్లిగుమ్మా, బెన్నుసాహి గ్రామస్తులు కలెక్టరేట్ వద్ద మంగళవారం ఆందోళన చేశారు. ఆర్.ఉదయగిరి సమితి అనఘా పంచాయతీ నుంచి ఈ మూడు గ్రామాలకు రోడ్డు వేయకపోతే వచ్చే సార్వత్రిక ఎన్నికలు బహిష్కరిస్తామని హెచ్చరించారు. అనేక సార్లు బ్లాక్ అధికారులు, కలెక్టర్‌కు వినతిపత్రాలు అందించినా ఫలితం కనిపించడం లేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

గంజాయి పట్టివేత



అరెస్టు చేసినవారిని చూపిస్తున్న ఎక్సైజ్ అధికారులు

పర్లాకిమిడి: స్థానిక మహేంద్రతనయ రోడ్డులో ఆంధ్రా-ఒడిశా సరిహద్దులో నది నాకాపాయింట్ వద్ద బీహార్ రాష్ట్రానికి చెందిన తుసారే అనే వ్యక్తి 11 కిలోల గంజాయితో ఎక్సైజ్ అధికారులకు పట్టుబడ్డారు. అలాగే పర్లాకిమిడి రైల్వేస్టేషన్ వద్ద బీహార్ రాష్ట్రానికి చెందిన కాకాసింగ్, బిష్ణుసింగ్‌లు 12 కిలోల గంజాయి బ్యాగులతో పోలీసులకు దొరికిపోయారు. ఎక్సైజ్ మొబైల్ యూనిట్ ఎస్ఐ(గజపతి) పద్మలోచన్ కోరో, ఏఎస్ఐ అజిబా గొమాంగో, జిల్లా సదర్ ఎక్సైజ్ ఎస్ఐ సుదర్శన్ బిసాయి తదితరులు నిందితులను పట్టుకున్నారు. వీరిని కోర్టుకు తరలించినట్లు పోలీసులు తెలియజేశారు.

మూడో అభ్యర్థి ఎవరో..!

- సమీపిస్తున్న రాజ్యసభ నామినేషన్ల గడువు
- 3 స్థానాలకు జరగనున్న ఎన్నికలు
- ఇద్దరు అభ్యర్థులను ప్రకటించిన బీజేడీ
- మూడో అభ్యర్థిపై సర్వత్రా ఉత్కంఠ
- గత ఎన్నికలో బీజేడీ మద్దతుతో బీజేపీ విజయం



బీజేడీ అభ్యర్థులతో సీఎం నవీన్ పట్నాయక్



నామినేషన్ దాఖలు చేస్తున్న బీజేడీ అభ్యర్థులు దేబాశిష్ సామంత్రాయ్, సుభాషిస్ ఖుంటియా

భువనేశ్వర్:

రాష్ట్రంలో రాజ్యసభ ఎన్నికల ఘట్టం రసవత్తరంగా సాగుతోంది. శాసనసభలో సంఖ్యా బలంతో అధికార పక్షం బిజూ జనతా దళ్ (బీజేడీ)కి గెలుపు తథ్యం. తాజా ఉత్తర్వుల ప్రకారం 3 స్థానాల భర్తీకి ఎన్నిక జరగనుంది. ముగ్గురు రాజ్యసభ సభ్యుల పదవీ కాలం ముగుస్తుండగా, వీరిలో ఇద్దరు బీజేడీ సభ్యులు కాగా, ఒకరు బీజేపీ సభ్యుడు ఉన్నారు. బీజేపీ అభ్యర్థి గత ఎన్నికలో బీజేడీ మద్దతులో గెలిచారు.

ఇద్దరు సభ్యులు ఖరారు

ఇప్పటికే 2 స్థానాల్లో పోటీ చేసేందుకు బీజేడీ తమ అభ్యర్థులను ఖరారు చేసింది. వీరిలో కటక్ బరాబటి నియోజకవర్గం సిటింగ్ ఎమ్మెల్యే దేబాశిష్ సామంత్రాయ్, బీజేడీ పూరీ జిల్లా శాఖ అధ్యక్షుడు, రాష్ట్ర యువజన శాఖ ఉపాధ్యక్షుడు సుభాసిష్ ఖుంటియాలు ఉన్నారు. వీరివురు మంగళవారం బీజేడీ అధ్యక్షుడు, సీఎం నవీన్ పట్నాయక్ సమక్షంలో ఒడిశా అసెంబ్లీ భవనంలో తమ నామినేషన్ దస్తావేజులు దాఖలు చేశారు. ముఖ్యమంత్రితో పాటు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బిక్రమ్ కేశరి అరూఖ్, ఆరోగ్య-కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి నిరంజన్ పూజారి ఇతర ప్రముఖులు హాజరయ్యారు.

మూడో స్థానంపై ఉత్కంఠ

రాజ్యసభలో రాష్ట్రానికి చెందిన 3 స్థానాలు ఖాళీ అవుతున్నాయి. ఈ జాబితాలో అశ్విని వైష్ణవ్, అమర్ పట్నాయక్, ప్రశాంత నందా ఉన్నారు. వీరి ముగ్గురి పదవీ కాలం ఈ ఏడాది ఏప్రిల్ నెలలో ముగియనుంది. మూడో స్థానానికి అధికార పార్టీ తన అభ్యర్థిని ఇంకా ప్రకటించలేదు. మూడో అభ్యర్థిని ఖరారు చేయడంలో జాప్యం రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ రేపుతోంది. మూడో అభ్యర్థిని బీజేడీ ఇప్పటికే ఖరారు చేసిందని ఊహాగానాలు షికారు చేస్తున్నాయి. ఒకటి రెండు రోజుల్లో స్పష్టమవుతుందని ఈ వర్గాల భోగట్టా. మూడు స్థానాల్లో గెలవడానికి అవసరమైన సంఖ్యాబలం బీజేడీకి పుష్కలంగా ఉంది.

బరిలో బీజేపీ అభ్యర్థి..?

రాజ్యసభ ఎన్నికల్లో అభ్యర్థిని బరిలోకి దింపేందుకు భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఉవ్విళ్లూరుతోంది. అయితే స్వతంత్రంగా గెలిచే అవకాశం ఏమాత్రం లేదు. బీజేపీ అధిష్టానం మంతనాలతో గతసారి బీజేడీ మద్దతుతో అశ్విని వైష్ణవ్‌ని బరిలోకి దింపి విజేతగా నిలిపింది. ఈసారి ఇదే వ్యూహంతో బీజేపీ పావులు కదుపుతోంది. మరోవైపు ఈసారి బీజేపీ అభ్యర్థికి బీజేడీ మద్దతు ఇచ్చే అవకాశం లేనట్లు పుకార్లు వినిపిస్తున్నాయి. గత ఎన్నికల్లో మూడో అభ్యర్థిత్వంపై లోపాయికారీ మంతనాలు ఇప్పటికీ బయటకు పొక్కకున్నా, రైల్వే శాఖకు సారథ్యం వహించిన అశ్విని వైష్ణవ్ రాష్ట్రానికి అడుగడుగున సానుకూలంగా వ్యవహరిస్తూ వివాదరహితంగా కొనసాగారు. ఈ నేపథ్యంలో మరోసారి బీజేపీ అభ్యర్థిగా అశ్విని వైష్ణవ్ రాజ్యసభ అభ్యర్థిత్వంపై బీజేడీ మొగ్గు చూపే అవకాశం లేకపోలేదని ఒక వర్గం అభిప్రాయపడుతోంది. ఇదిలా ఉండగా అశ్విని వైష్ణవ్ త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో ప్రత్యక్ష పోటీకి సిద్ధమవుతున్నట్లు సైతం వార్తలు ప్రసారంలో ఉన్నాయి. మొత్తానికి రాజ్యసభ మూడో స్థానం గుట్టు బయట పడకపోవడంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

అశ్విని వైష్ణవ్ రాష్ట్ర పర్యటన

ఈ ఉత్కంఠ మధ్య రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ బుధవారం రాష్ట్ర పర్యటనకు విచ్చేయనున్నారు. రాజ్యసభ మంతనాలతో ముడి వేసుకుని ఈ పర్యటనకు విచ్చేస్తున్నట్లు రాజకీయ శిబిరాల్లో చర్చ జోరుగా సాగుతుంది. ఆయన 2 రోజులపాటు రాష్ట్రంలో పర్యటించనున్నారు.

బలమైన ప్రాతినిథ్యం

భారత పార్లమెంటులో బీజేడీ ప్రాతినిథ్యం అత్యంత బలంగా కొనసాగుతోంది. పార్లమెంటులో ప్రస్తుతం బీజేడీకి 21 మంది ఎంపీలు ఉన్నారు. లోక్‌సభ నుంచి 12 మంది, రాజ్యసభ నుంచి 9 మంది రాష్ట్రానికి ప్రాతినిథ్యం వహిస్తున్నారు. వీరిలో 18 మంది లోక్‌సభ లేదా రాజ్యసభకు తొలిసారిగా ఎంపీలుగా ఎన్నికై నవారు కావడం విశేషం. సాధారణంగా ఎగువ సభకు బీజేడీ కొత్త ముఖాలను పరిచయం చేయడం ఆనవాయితీగా కొనసాగుతోంది. వీరిలో పార్టీపై విధేయత ప్రదర్శించిన వారు ముందంజలో ఉన్నారు.

దళితులకు అవకాశం

భారత పార్లమెంట్‌లో దళితుల ప్రాతినిథ్యం బలపరిచే దిశలో ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ యోచిస్తున్నట్లు సమాచారం. మూడో అభ్యర్థిగా గిరిజన నాయకుడిని లేదా మహిళా అభ్యర్థిని ఖరారు చేసే అవకాశం ఉంది. కాని పక్షంలో సిటింగ్ లోక్‌సభ సభ్యుడిని ఎగువసభ వైపు మళ్లించి త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో కొత్త ముఖానికి అవకాశం కల్పించేందు మార్గం సుగమం చేయనున్నట్లు వార్తలు అందుతున్నాయి.

రేపటితో ముగింపు

ఎన్నికల సంఘం అధికారిక ఉత్తర్వుల ప్రకారం రాజ్యసభ ఎన్నికల నామినేషన్ దాఖలు గడువు ఈనెల 15తో ముగుస్తుంది. ఈలోగా 3వ అభ్యర్థిని ఖరారు చేయాల్సి ఉంది. 3వ అభ్యర్థి బీజేడీ, బీజేపీ ఎవరు అనే ఉత్కంఠ కొనసాగుతోంది. నామినేషన్ దాఖలు గడువుతో ఈ ఉత్కంఠకు తెరపడుతుంది. ఈ ఎన్నికలో సమగ్ర విజయం నిస్సందేహంగా బిజూ జనతా దళ్‌దే. ఫిబ్రవరి 27న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్య పోలింగ్ జరగనుంది. అదే రోజు సాయంత్రం 5 గంటలకు ఓట్ల లెక్కింపు నిర్వహిస్తారు.

పారిశుద్ధ్య కార్మికుల ఆందోళన



ఆందోళన చేస్తున్న మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు

బరంపురం: బరంపురం మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) పరిధిలోని పలు వార్డుల క్లీనింగ్‌ను ప్రవేట్ సంస్థకు పాలన యంత్రాంగం అప్పగించడాన్ని పారిశుద్ధ్య కార్మికులు వ్యతిరేకిస్తున్నారు. ఈ మేరకు బరంపురం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట సపాయి కర్మాచారి సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు అనిల్ కుమార్ నాయక్ మాట్లాడుతూ నగరంలో 42 వార్డులు ఉండగా, పలు వార్డులను బీఎంసీ ప్రవేటు సంస్థకు అప్పగించిందని ఆందోళన వ్యకం చేశారు. దీనివలన పలు ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. అనంతరం మేయర్ సంఘమిత్ర దొళాయికి వినతిపత్రం అందజేశారు. ఆందోళనలో సంఘం కార్యదర్శి అముల్యా పూజరి, కోశాధికారి చింతమని నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వినూత్నంగా కాంగ్రెస్ నిరసన




బైకు ర్యాలీలో పాల్గొన్న ఎంపీ సప్తగిరి ఉలక

- బీజేడీ, బీజేపీలది భార్యభర్తల బంధమని ఎద్దేవా

రాయగడ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దొందూ దొందేనని, వాళ్లది భార్యాభర్తల అనుబంధమని జిల్లా కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఈ మేరకు వినూత్నంగా నిరసన తెలియజేశారు. ఈ రెండు పార్టీలకు మంగళవారం గుణుపూర్‌లో ఒకే వేదికపై పెళ్లి జరిపించారు. జిల్లాలో ఇటువంటి తరహా నిరసన చేపట్టడం ఇదే మొదటిసారి కావడంతో వేడుకను చూసేందుకు అధిక సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. వరుడిగా బీజేపీ, వధువుగా బీజేడీ మాస్కులు పెట్టించి ఇద్దరికీ పెళ్లి చేయించారు. ఈ శుభ కార్యానికి ముందురోజు సామాజిక మాధ్యమాల్లో ఆహ్వాన పత్రికలు సైతం పంచిపెట్టారు. కాంగ్రెస్ యువజన నాయకుడు సత్యజిత్ గొమాంగో అందరికీ ఆహ్వానం పలికారు. కొరాపుట్ లోక్‌సభ ఎంపీ సప్తగిరి ఉలక ముఖ్య అతిథిగా హాజరై వరుడు, వధువును ఆశీర్వదించారు. వ్యంగ్య ప్రశ్నలతో ఇద్దరినీ పలికరించారు. రాష్ట్రాన్ని దోచుకునేవారు వధువుగా(బీజేడీ), దేశాన్ని దోచుకునే పార్టీ(బీజేపీ)ల వివాహానికి తనను ఆహ్వానించారన్నారు. ఇద్దరి మధ్య ప్రేమ బంధం మరీ ముదురిపోవడంతో పెళ్లిచేసి, ఇంటికి పంపించే సమయం ఆసన్నమయ్యిందని పేర్కొన్నారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో కేంద్రం, రాష్ట్రంలో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అంతకుముందు కాంగ్రెస్ కార్యకర్తలతో ఎంపీ సప్తగిరి, ఆయన సతీమణి పూజా ఉలకలు బైక్ ర్యాలీలో పాల్గొన్నారు.



వధువు, వరుడిని అభినందిస్తున్న ఎంపీ సప్తగిరి



We request the pleasure of your company to the auspicious occasion of the Marriage Ceremony of
BJP
with
BJD
On 13th February 2024, Tuesday between 11:35 A.M.
at Town Hall, Gunupur.
Kindly grace the occasion.

Awaiting You
Satyajit Gamango
Youth Congress Leader
138 - Gunupur Assembly Constituency

LUNCH
On 13th February 2024, Tuesday
from 1:00 P.M. onwards at Town Hall, Gunupur

పార్టీల పెండ్లి ఆహ్వాన పత్రిక

అధ్యక్షుడిగా శశిభూషణ పాత్రో



శశిభూషణ పాత్రో

జయపురం: కొరాపుట్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా సీనియర్ నేత శశిభూషణ పాత్రోను పీసీసీ అధ్యక్షుడు శరత్ పట్నాయక్ నియమించారు. అయితే డీసీసీ అధ్యక్షుడిగా 8 నెలల క్రితం నియమితులైన దుర్గా శంకర సాహును తొలగించడంపై రాజకీయ వర్గాల్లో చర్చనీయమైంది. ప్రస్తుతం నియమించబడిన శశిభూషణ పాత్రో నందపూర్ సమితి మాజీ అధ్యక్షుడు, అలాగే జిల్లా పరిషత్ మాజీ సభ్యుడిగా సైతం పనిచేశారు. కాంగ్రెస్ పార్టీలో క్రమశిక్షణ కలిగిన నేతగా అతడికి మంచి పేరుంది. నందపూర్ సమితి అధ్యక్షుడిగా రెండు పర్యాయాలు ఎన్నికయ్యారు. దివంగత మంత్రి రామచంద్ర ఉల్క ప్రేరణతో పాత్రో 1975లో కాంగ్రెస్‌లో చేరి తన రాజకీయ జీవితం ప్రారంభించారు. అప్పటి నుంచి ఆయన ఆ పార్టీలోనే కొనసాగుతున్నారు.

భారతమాత విగ్రహంపై దాడి



భారతమాత విగ్రహం

రాయగడ: జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితి సికరపాయిలో జనవరి 26వ తేదీన ప్రతిష్టించిన భారత మాత విగ్రహాన్ని గుర్తు తెలియని దుండగులు సోమవారం రాత్రి విరగ్గొట్టారు. దీనిపై స్పందించిన గ్రామస్తులు దుండగులను పట్టుకుని శిక్షించాలని కోరుతూ కల్యాణ సింగుపూర్ పోలీసుస్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. విగ్రహంపై రాళ్ల సాయంతో దాడి చేసినట్లు గుర్తించారు. దర్యాప్తు జరిపి దుండగులను పట్టుకుంటామని ఐఐసీ సౌదామిని తెలియజేశారు.

ఐఐసీ అధికారిగా అశోక్ కుమార్



బరంపురం: గంజాం పోలీసు జిల్లా పరిధి బెంగునియపడా పోలీసుస్టేషన్ ఐఐసీ అధికారిగా అశోక్ కుమార్ హంసదా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు కొందమాల్ జిల్లా దరింగబడి పోలీసుస్టేషన్ ఐఐసీ అధికారిగా ఆయన విధులు నిర్వహించేవారు. బెంగునియపడా పోలీసుస్టేషన్ పరిధిలో శాంతి భద్రతలు పరిరక్షిస్తామని వెల్లడించారు.

అమ్మో.. పులి



రహదారిలో సంచరిస్తున్న పెద్దపులి



లేగదూడను పరిశీలిస్తున్న అటవీ అధికారులు

బరంపురం: కొందమాల్ జిల్లా బెల్లగడా అటవీ రేంజ్ చుట్టుపక్కల గ్రామాల్లోకి సోమవారం రాత్రి పెద్దపులి చొరబడి భయానక వాతావరణం సృష్టించింది. గ్రామంలోకి భీకరమైన గాండ్రిపులతో వచ్చి పశువుల శాలలో లేగదూడను నోట కరుచుకుంటూ తీసుకెళ్లిపోయింది. దీంతో ఆ చుట్టుపక్కల గ్రామాల్లో ప్రజలు భయాందోళన వ్యక్తం చేశారు. నెల రోజుల క్రితం తుమ్ముడిబందా అటవీ ప్రాంతలో పెద్దపులి సంచరిస్తూ వరుసగా సుమారు ఐదుకి పైగా ఆవులపై దాడిచేసి చంపేసిన విషయం మరువకముందే మరలా ఇటువంటి ఘటన చోటుచేసుకోవడంతో ప్రజలు బయటకు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. ఇదిలా ఉండగా బల్లిగుడా-ఫుల్బాణి మధ్య జాతీయ రహదారిలో పెద్దపులి తిరుగాడడం చూసినట్లు వాహనదారులు తెలియజేస్తున్నారు. బస్సుకి ఎదురుగా రావడంతో పెద్దపులిపై లైట్‌వేసి హారన్ గట్టిగా కొట్టడంతో అడవిలోకి వెళ్లిపోయినట్లు పేర్కొన్నారు. సమాచారం అందుకున్న ఫుల్బాణి అటవీ డివిజన్ అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని బెలగడా గ్రామ శివారు ప్రాంతంలో పరిశీలించగా లేగదూడను తినేసినట్లు గమనించారు. దీంతో సమీప ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేశారు.

ఆందోళన బాటలో వ్యవసాయ వర్కర్లు



ఆందోళన చేపడుతున్న వ్యవసాయ వర్కర్లు

రాయగడ: తమ న్యాయమైన ఆరు డిమాండ్లను ప్రభుత్వం ఆమోదించాలని కోరుతూ గ్రామీణ వ్యవసాయ వర్కర్లు ఆందోళన చేపట్టారు. ఈ మేరకు స్థానిక జిల్లా వ్యవసాయ శాఖ ముఖ్య కార్యాలయం ఎదుట మంగళవారం బైఠాయించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు ప్రభాత్ ప్రకాష్ నాయక్ మాట్లాడుతూ 2017 నుంచి ప్రభుత్వానికి తమ డిమాండ్ల గురించి పలుమార్లు విన్నవించుకున్నప్పటికీ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అందువలన ఆందోళన చేయడం అనివార్యమైందని వెల్లడించారు. గ్రేడ్ పే రూ.4,200 చేయాలని, గ్రామీణ వ్యవసాయ వర్కర్లుగా ఉన్న క్యాడర్‌ను పంచాయతీ వ్యవసాయ అధికారులుగా గుర్తించాలని కోరారు. వారం రోజుల్లోగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోకుంటే ఆందోళన ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.

విజేతగా హరహర మహాదేవ్ టీమ్



అశోక్ కుమార్

జయపురం: జయపురం బాపూజీనగర్‌లో జరిగిన నైట్ వాలీబాల్ పోటీల్లో హరహర మహాదేవ్ టీమ్ విజేతగా నిలిచింది. మంగళవారం రాత్రి జరిగిన ఫైనల్స్‌లో ఎంఎల్‌డబ్ల్యూ టీమ్, హరహర మహాదేవ్ టీమ్‌లు తలపడగా, మహాదేవ్ టీమ్ విజేతగా నిలిచింది. బహుమతుల ప్రధాన కార్యక్రమంలో బీజేపీ నేత హిమింశు మహాపాత్ర పాల్గొన్నారు. గత నెల 27వ తేదీన ప్రారంభమైన ఈ పోటీల్లో 8 టీములు పాల్గొన్నాయని నిర్వాహకులు వెల్లడించారు.

అడవుల సంరక్షణపై చైతన్య ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న ప్రధాన్, దివ్యమాధురులు

రాయగడ: అడవుల సంరక్షణపై వృక్ష సంపదను పరిరక్షించుకుందామని తెలియజేస్తూ జిల్లా అటవీ శాఖ మంగళవారం చైతన్య ర్యాలీ నిర్వహించింది. స్థానిక రైతుల కాలనీ వద్దనున్న ఫారెస్ట్ పార్క్ నుంచి ఈ ర్యాలీని నిర్వహించారు. విద్యార్థులు, వివిధ సంస్థలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్న ఈ ర్యాలీని అటవీ శాఖ రేంజర్ అశోక్ కుమార్ ప్రధాన్, వన సంరక్షణ అధికారి దివ్యమాధురిలు జెండాఊపి ప్రారంభించారు . ఫారెస్ట్ పార్క్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ మూడు కిలోమీటర్ల అనంతరం మరలా ఫారెస్టు పార్క్ వరకు చేరుకోవాలని నిర్వాహకులు లక్ష్యాన్ని నిర్ధారించారు. ర్యాలీలో గెలిపొందిన వారికి బహుమతులను అందజేశారు.

క్లుప్తంగా

15న శ్రీ శివానీలో జాబ్‌మేళా

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెంలోని శ్రీ శివానీ ఇంజినీరింగ్ కాలేజీలో ఈ నెల 15వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీనివాసరావు తెలిపారు. కళాశాలలో మంగళవారం వివరాలు వెల్లడించారు. ఆంధ్ర ప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఉదయం 9.30 గంటల నుంచి ఇంటర్వ్యూలు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు స్కిల్‌యూనివర్స్.ఏపీఎస్ఎస్‌డీసీ.ఇన్ వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు ఉత్తరాంధ్ర జిల్లాల్లో నియామకాలు చేపట్టనున్నట్లు చెప్పారు. 10వ తరగతి, ఇంటర్మీడియెట్, డిగ్రీ, పీజీ, ఎంబీఏ, బి.ఫార్మసీ, ఎంఫార్మసీ పూర్తయ్యి 18 ఏళ్లు నిండిన వారు అర్హులని పేర్కొన్నారు. యువత అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేషనల్ అథ్లెటిక్ మీట్‌కు సత్యవరం విద్యార్థి


విద్యార్థి హరీష్‌కు ఆర్థిక సాయం చేస్తున్న ఉపాధ్యాయ బృందం

నరసన్నపేట: నేషనల్ అథ్లెటిక్స్ మీట్‌కు నరసన్నపేట మండలం సత్యవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న హరీష్ ఎంపికయ్యాడు. విద్యార్థి మంగళవారం పయనమయ్యాడు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఈ నెల 16 నుంచి 18 వరకూ నేషనల్ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ అథ్లెటిక్ మీట్ నిర్వహిస్తున్నారు. ఇందులో హరీష్ 60 మీటర్ల రన్నింగ్ లాంగ్‌జంప్ విభాగంలో పాల్గొననున్నాడు. స్కూల్ టీచర్లు ప్రయాణ ఖర్చుల కోసం సాయం అందజేశా రు. ఈ సందర్భంగా ఎంఈఓలు దాలినాయు డు, శాంతారావు, హెచ్ఎం వకులా రత్నమాల, ఉపాధ్యాయులు విద్యార్థినిని అభినందించారు.

'లోకేష్ శంఖారావం అట్టర్‌ఫ్లాప్'


ఆమదాలవలస: ఆమదాలవలసలో నారా లోకేష్ ఆధ్వర్యంలో చేపట్టిన శంఖారావం కార్యక్రమం అట్టర్ ఫ్లాప్‌గా మారిందని వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం జోనల్ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలో నిర్వహించిన శంఖారావానికి ప్రజలు ఎవరూ రాకపోవడంతో పూర్తిగా విఫలమైందని, వచ్చిన ఆ కాస్త జనం లోకేష్ మాట్లాడుతుండగా వెళ్లిపోయారని పేర్కొన్నారు. రాష్ట్రంలో టీడీపీని ప్రజలు ఎంతగా ఛీత్కరించుకుంటున్నారో తెలియజెప్పేందుకు ఆమదాలవలసలో జరిగిన నిన్నటి శంఖారావం కార్యక్రమమే ఒక చక్కని ఉదాహరణ అని తెలిపారు. టీడీపీకి లోకేష్ ఒక ఐరన్ లెగ్ అని, లోకేష్‌ని ఎల్లో మీడియా ఎంత జాకీలెత్తి లేపినా ప్రజల్లో ఆదరణ లభించడం లేదని విమర్శించారు. లోకేష్‌కు అంత ఛరిష్మా లేదని చంద్రబాబుకు ఎప్పుడో తెలుసునని, అందుకే ఈ పొత్తుల పాట పాడుతున్నాడని విమర్శించారు.

అనధికార ఇసుక తవ్వకాలు వద్దు


ఇసుక ర్యాంపు వద్ద అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్

నరసన్నపేట: వంశధార నదిలో అనధికారికంగా ఇసుక తవ్వకాలు చేయవద్దని, నిఘా పెంచాలని కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. మండలం గోపాలపెంట వద్ద వంశధారలో గతంలో నిర్వహించిన ఇసుక ర్యాంపును ఆయన మంగళవారం పరిశీలించారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ వారి ఫిర్యాదు మేరకు పరిశీలన జరిగింది. అనుమతి లేనిదే ఇసుక తరలకుండా తగిన చర్యలు తీసుకోవాలని మైన్స్ అధికారులకు సూచించారు. మండలంలో ఎక్కడెక్కడ ఇసుక ర్యాంపులు ఉన్నాయనేది మైన్స్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఆర్డీఓ రంగయ్య, తహసీల్దార్ కనకారావు, ఎంపీడీఓ రామకృష్ణ ఉన్నారు.

ఏఎస్ఐ కుటుంబానికి రూ. 75 వేల నగదు చెక్కు


ఏఎస్ఐ బెన్నయ్య కుమారులకు రూ. 75 వేల చెక్కును అందజేస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : విధి నిర్వహణలో అనారోగ్యంతో మరణించిన ఆర్మ్‌డ్ రిజర్వ్ ఏఎస్ఐ బెన్నయ్య కుటుంబానికి రూ.75 వేల నగదు చెక్కును ఎస్పీ జీఆర్ రాధిక మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అందజేశారు. ప్రభుత్వం నుంచి మంజూరైన ఫ్లాగ్‌ఫండ్ రూ. 25 వేలు, విడో ఫండ్ రూ. 50 వేలు మొత్తంగా కలిపి ఈ చెక్కులను ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బెన్నయ్య అనారోగ్యంతో మరణించడం బాధాకరమని, వారి కుటుంబ సభ్యులకు ఎల్లవేళలా జిల్లా పోలీసు శాఖ అండగా నిలుస్తుందని, వారికి రావాల్సిన ఇతర ప్రయోజనాలు సకాలంలో అందేలా చేస్తామని ఎస్పీ అన్నారు. కార్యక్రమంలో ఏవో సీహెచ్ గోపీనాథ్, ఏఏఓ శోభారాణి పాల్గొన్నారు.

వినియోగదారులకు తీపి కబురు

- తగ్గిన విద్యుత్ చార్జీలు
- యూనిట్‌కు 10 పైసలు తగ్గింపు



వేర్వేరు డిస్కమ్‌ల ధరలు	
సరఫరా సంస్థ	కిలోవాట్ ధర (రూ.ల్లో)
టీపీసీఓడీఎల్	315
టీపీఎన్ఓడీఎల్	350
టీపీడబ్ల్యూఓడీఎల్	380
టీపీఎస్ఓడీఎల్	200

భువనేశ్వర్: రాష్ట్రంలో గృహ వినియోగదారులకు విద్యుత్ సరఫరా చార్జీలు తగ్గించారు. ప్రతీ స్లాబ్‌లో యూనిట్ చార్జీని 10 పైసలు తగ్గించారు. ఒడిశా ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (ఓఈఆర్‌సీ) మంగళవారం రాష్ట్రంలో విద్యుత్ సరఫరా బిల్లుపై తుది ఉత్తర్వును విడుదల చేసింది. గృహ వినియోగం మినహా ఇతర వర్గాల విద్యుత్ చార్జీల్లో ఎటువంటి మార్పు లేనట్లు ఈ ఉత్తర్వులు స్పష్టం చేశాయి. అయితే ఈ వర్గాల చార్జీలు 3 ఏళ్ల వరకు స్థిరంగా కొనసాగుతాయని ప్రకటించడం విశేషం. దారిద్ర రేఖ దిగువ (బీపీఎల్) వినియోగదారులకు నెలవారీ స్థిర ఛార్జీలు నెలకు రూ.80 నుంచి రూ.70కి తగ్గించబడ్డాయి. దీంతో నెలవారీ బిల్లులతో రూ.10 తగ్గింపు వర్తిస్తుంది. ఎలక్ట్రానిక్ బిల్లు (ఈ-బిల్లు) వ్యవస్థ వినియోగదారులకు అదనంగా రూ.10 తగ్గింపు ప్రకటించారు.

రాయితీ సౌలభ్యం

హరిత విద్యుత్ (గ్రీన్ ఎనర్జీ) చార్జీ ప్రీమియం యూనిట్‌కు 25 పైసలు నుంచి 20 పైసలకు తగ్గించబడింది. ప్రీ-పెయిడ్ మీటర్లను కలిగి ఉన్న వినియోగదారులు ప్రీ-పెయిడ్ మొత్తంపై 4 శాతం రాయితీని పొందుతారు. ఎల్‌టీ గృహ వినియోగదారులు, సింగిల్ ఫేజ్ సాధారణ 4 శాతం డిజిటల్ చెల్లింపు రాయితీ సౌలభ్యం యథాతథంగా కొనసాగుతుంది. శీతల గిడ్డంగులు యూనిట్ చార్జీ రూ.1.60 తగ్గించారు. ఈ లెక్కన యూనిట్ చార్జీ రూ.4.60 నుంచి రూ.3కి తగ్గుతుంది. మెగా ఎత్తిపోతల పాయింట్ వినియోగదారులకు యూనిట్‌కు రూ.2 తగ్గింపు తర్వాత యూనిట్‌కు రూ.3.80 తగ్గింపు పరిగణనలోకి తీసుకోవడంతో భారీ తగ్గింపు అందుబాటులోకి వస్తుంది.

అదనపు రాయితీ

గడువు తేదీలోగా బిల్లు చెల్లించినట్లయితే గ్రామీణ ఎల్‌టీ గృహ వినియోగదారులకు యూనిట్‌కు 10 పైసలు రాయితీ లభిస్తుంది. లఘు మరియు మధ్య తరహా ఎల్‌టీ పారిశ్రామిక సంస్థలు నిర్ధారిత కాల పరిమితిలో బిల్లు చెల్లిస్తే నెలవారీ ఆపరేటింగ్ లోడ్ ఫ్యాక్టర్ 40 శాతం కంటే ఎక్కువగా ఉంటే వినియోగించే అన్ని యూనిట్లకు యూనిట్‌కు 10 పైసలు చొప్పున తగ్గింపు వర్తింపజేస్తారు. 10 కేవీ కలిగి ఉన్న స్మార్ట్ మీటర్లు కలిగి ఉన్న వాణిజ్య, పారిశ్రామిక మరియు గృహ వినియోగదారులు సౌర విద్యుచ్ఛక్తి చార్జీలో యూనిట్‌కు 10 పైసలు చొప్పున రాయితీ కల్పిస్తారు. ఈ వర్గపు వినియోగదారులు పీక్ అవర్స్ సమయంలో యూనిట్‌కు 20 పైసలు సర్‌చార్జిని చెల్లించాల్సి ఉంటుంది. ఈహెచ్‌టీ స్థాయిలో 80 శాతం కంటే అధిక లోడ్ ఫ్యాక్టర్‌లో విద్యుత్‌ను తీసుకునే పారిశ్రామిక వినియోగదారులకు యూనిట్‌కు 10 పైసలు చొప్పున తగ్గింపు పొందుతారు. రాష్ట్రంలో సమగ్ర బీఎస్‌పీ సగటు ధర యూనిట్‌కు 329.00 పైసల నుంచి 328.20 పైసలకు స్వల్పంగా తగ్గించబడింది. ట్రాన్స్‌మిషన్ టారిఫ్ యూనిట్‌కు 24 పైసల ధర యథాతథంగా కొనసాగుతుంది.

సత్తాచాటిన సెంచూరియన్ విద్యార్థులు


శ్రీనివాస పండా


తనీష్ పాత్రో


రాహుల్ గాడో


అట్టాల జాహ్నవి


సమాంతర్ మైత్రా

పర్లాకిమిడి: జాయింట్ ఇంజినీరింగ్ ఎంట్రన్స్-2024 మెయిన్స్ ఫలితాల్లో సెంచూరియన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ఎనిమిది మంది ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు ప్రిన్సిపాల్ సునీతా పాణిగ్రాహి తెలియజేశారు. మంగళవారం ప్రకటించిన ఫలితాల్లో ప్లస్ టూ విద్యార్థులు శ్రీనివాస పండా 96.4 శాతం సాధించగా, తనీషా పాత్రో 92.5 శాతం, రాహుల్ గాడో 92.2 శాతం, సమాంతర్ మైత్రా 87.5 శాతం, అట్టాల జాహ్నవి 85.4 శాతం, కె.రాజేంద్ర 78.9 శాతం సాధించారు. వీరిలో శ్రీనివాస పండా సెంచూరియన్ పబ్లిక్ స్కూల్ అధ్యాపకుడు రబినారాయణ పండా కుమారుడు. విద్యార్థులకు వర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య డి.ఎస్.రావు, ప్రిన్సిపాల్ సునీతా పాణిగ్రాహి, ప్రాంతీయ సంచాలకులు సంబిత్ పాత్రో తదితరులు అభినందనలు తెలిపారు.

దొంగతనం కేసులో నిందితులు అరెస్టు


అరెస్టైన నిందితులను చూపిస్తున్న పోలీసులు

రాయగడ: రాగి తీగల దొంగతనం కేసులో నలుగురు నిందితులను మునిగుడ పోలీసులు మంగళవారం అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. వివరాల్లోకి వెళ్తే.. జిల్లాలోని మునిగుడ సరిహద్దు ప్రాంతంలోని లంజిఘడ్ కంపెనీలో 164.380 కిలోల రాగి తీగలను దొంగిలించి తీసుకొస్తున్న నలుగురిని మునిగుడ పోలీసులు మునిగుడకు దగ్గరలో జమరిగుడ వద్ద పట్టుకొని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రాగి తీగలతో గల సంచులను స్వాధీనం చేసుకున్నారు. నిందితుల వివరాలను ఐఐసీ సొదామిని బెహర వెల్లడించలేదు.

ముక్తికాంత్ మిశ్రాకు డాక్టరేట్


డాక్టరేట్ అందుకున్న ముక్తికాంత్ మిశ్రా (మధ్యలో ఉన్నవారు)

పర్లాకిమిడి: స్థానిక సెంచూరియన్ వర్సిటీ చైర్మన్ డా.ముక్తికాంత మిశ్రాకు ఆస్ట్రేలియాకు చెందిన డైకిన్ విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. గత పదిహేనేళ్లుగా సెంచూరియన్ వర్సిటీ ఆస్ట్రేలియాలో ఉన్నటువంటి డైకిన్ వర్సిటీతో వివిధ కోర్సుల్లో భాగస్వామిగా ఉంది. దీనిలో భాగంగా సెంచూరియన్ వర్సిటీలో ఉన్నత విద్య, స్కిల్ డవలప్‌మెంట్, సామాజిక అంశాలైన గ్రామ్‌తరంగ్ వంటివి దూరదృష్టితో అభివృద్ధి చేసిన చైర్మన్ డాక్టర్ ముక్తికాంత మిశ్రాకు డాక్టరేట్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవార్డుతో తన బాధ్యత మరింత పెరిగిందన్నారు. ఆయనకు వర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య డి.ఎస్.రావు, వీసీ డాక్టర్ సుప్రియా పట్నాయక్, డీన్ డా.అనితా పాత్రో, డాక్టర్ దేవేందర్ రెడ్డి తదితరులు అభినందనలు తెలియజేశారు.

ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశాలకు షెడ్యూల్ వెల్లడి

శ్రీకాకుళం న్యూకాలనీ: ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం-2009 ప్రకారం 2024-25 విద్యా సంవత్సరానికిగాను జిల్లాలోని అన్ని ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశాలు పొందేందుకు ప్రభుత్వం షెడ్యూల్ వెల్లడించిందని డీఈఓ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. 25 శాతం సీట్లను అన్ని ప్రైవేటు పాఠశాలలు కేటాయించాల్సిందేనని పేర్కొన్నారు.

ఈ షెడ్యూల్ ప్రకారం వెబ్ పోర్టల్‌లో ఈనెల 13 నుంచి 20 వరకు నమోదు చేసుకోవాలని, అలాగే ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఫిబ్రవరి 23 నుంచి మార్చి 14 వరకు, మొదటి జాబితా ఎంపిక ప్రక్రియను మార్చి 20 నుంచి 22 వరకు చేసి ఏప్రిల్ 1న ఎంపికైన వారి జాబితా వెల్లడిస్తామన్నారు. రెండో జాబితాను ఏప్రిల్ 15న వెల్లడిస్తామని చెప్పారు. వివరాలకు సీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ అనే వెబ్‌పోర్టల్‌ను పరిశీలించాలని సూచించారు.

గంజాంలో సీఎం నవీన్ పర్యటన నేడు


బహిరంగ సభ ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న కలెక్టర్ దివ్యజ్యోతి పరిడా

బరంపురం: తాను ప్రాతినిధ్యం వహిస్తున్న గంజాం జిల్లాలో సీఎం నవీన్ పట్నాయక్ బుధవారం పర్యటించనున్నారు. బుధవారం ఉదయం 10.20 గంటల సమయంలో రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌లోని నవీన్ నివాస్ నుంచి సీఎం నవీన్ బిజూ అంతర్జాతీయ విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడ నుంచి ప్రత్యేక హెలీప్యాడ్‌లో బరంపురం నగరానికి దగ్గర రొంగయిలొండా పరిధిలోని పాలురు హిల్స్‌లో దిగుతారు. పాలురు హిల్స్‌పై 20 ఎకరాల్లో రాష్ట్ర ప్రభుత్వ నిధులతో రాష్ట్రంలోనే మొట్ట మొదటి నిర్మించిన అర్బన్ ఎడ్యుకేషనల్ ఎస్సీ, ఎస్టీ కాంప్లెక్స్‌ని ప్రారంభించనున్నారు. అదేవిధంగా రొంగాయిలొండాలో కొత్తగా నిర్మాణం జరిగిన రెండు అదర్శ కేంద్ర విద్యాలయాల భవనాలను ప్రారంభిస్తారు.

అలాగే హింజిలికాట్ పరిధి సెరగడా బ్లాక్‌లోని క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. అనంతరం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని శంకుస్థాపనలు చేయనున్నారు. ఆ తర్వాత ప్రత్యేక హెలీప్యాడ్‌లో తిరిగి రాజధాని భువనేశ్వర్ చేరుకోనున్నారు.

విద్యార్థులు లక్ష్యాలతో ముందుకు సాగాలి: వీసీ


మాట్లాడుతున్న వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కేఆర్ రజిని

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులు లక్ష్యాలతో ముందుకు సాగాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కేఆర్ రజిని అన్నారు. వర్సిటీలోని కామర్స్ అండ్ మేనేజ్ మెంట్ విభాగం ఆధ్వర్యంలో ఎంబీఏ విద్యార్థులు ఫ్రెషర్స్ డే వేడుకలు మంగళవారం నిర్వహించారు. ఈ వేడుకల్లో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో విద్యార్థుల ఉద్యోగ, ఉపాధి కల్పనలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు.

పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా విద్యార్థులు నైపుణ్యాలు సాధించాలని అన్నారు. సమయపాలన, క్రమశిక్షణ రెండూ విద్యార్థులకు అవసరమని వివరించారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకునేందుకు నిరంతరం నైపుణ్యాలపై విద్యార్థులు దృష్టిపెట్టాలని అన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య, హానరీ ప్రొఫెసర్ తమ్మినేని కామరాజు, కోర్సు కోఆర్డినేటర్ డాక్టర్ నీలం సంతోష్ రంగనాథ్ పాల్గొన్నారు.

కమ్మసిగడాం జాతర ఏర్పాట్ల పరిశీలన


కమ్మసిగడాం జాతర ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న సీఐ రామచంద్రరావు

రణస్థలం: ఈ నెల 18 నుంచి మూడు రోజుల పాటు జరగనున్న కమ్మసిగడాం మహాలక్ష్మి తల్లి జాతర ఏర్పాట్లను జేఆర్ పురం సీఐ జి.రామచంద్ర రావు, ఎస్ఐ కె.గోవిందరావు మంగళవారం పరిశీలించారు. ట్రాఫిక్ సమస్య, వాహనాల రాకపోకలు, పార్కింగ్ వంటి రూట్ మ్యాప్‌ను సమీక్షించారు. రణస్థలం నుంచి వచ్చే వాహనాలను యాగాటిపాలెం వద్ద, అలాగే చీపురుపల్లి వైపు వాహనాలకు వెల్బురాయి కూడలి వద్ద, రామతీర్థాలు వైపు వాహనాలకు పున్నానపాలెం కూడలి వద్ద పార్కింగ్‌కు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి నడుకుదిటి ఈశ్వరరావు, కమిటీ ఉపాధ్యక్షుడు వెలిచేటి రామకృష్ణ, సభ్యులు రాజా రవీంద్ర, తేజ, రాజశేఖర్, మన్నె లక్ష్మీ ప్రసాద్, రాయుడు, మౌళి, గురాల ప్రసాద్ ఉన్నారు.

అర్హత ఉన్న జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: అర్హత ఉన్న జర్నలిస్టులకు ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ఇళ్ల స్థలాలను మంజూరు చేస్తామని కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. జర్నలిస్ట్ హౌసింగ్ స్కీమ్ జిల్లా స్థాయి కమిటీ సమావేశం మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించారు. కలెక్టర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో డీఆర్ఓ ఎం.గణపతి రావు, ఆర్డీఓ సీహెచ్ రంగయ్య తదితరులు పాల్గొన్నారు. జీఎంఎంఎస్ నంబర్ 535లో ఉన్న అన్ని నిబంధనలకు పాటించి అర్హత ఉన్న జర్నలిస్టులకు హౌసింగ్ సైట్స్ ఇవ్వడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఐదేళ్ల అక్రిడేషన్ అనుభవం కలిగిన వారిని కమిషనర్, సమాచార పౌర సంబంధాల శాఖ, విజయవాడ వారు గుర్తించి పంపిన ప్రాథమిక జాబితాను పరిశీలించిన అనంతరం తుది జాబితా మేరకు ఇంటి స్థలాలివ్వడం జరుగుతుందన్నారు. ప్రాథమిక వెరిఫికేషన్ జరిగి జిల్లాకు 326 దరఖాస్తులు వచ్చాయన్నారు.

ఈ దరఖాస్తులను ఆర్డీఓ/సబ్ కలెక్టర్లకు పంపించి పరిశీలన చేయిస్తున్నామని తెలిపారు. అనంతరం అర్హత ఉన్న వారికి ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ మేరకు స్థలాన్ని సేకరించాలని ఆర్డీవోలకు ఆదేశించారు. సమావేశంలో జూమ్ ద్వారా టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, పలాస ఆర్డీఓ కార్యాలయ ప్రతినిధి, తదితరులు హాజరయ్యారు.

మిద్దె పంట.. ఖర్చులు ఆదా అంట!

- డాబాపైనే కూరగాయల సాగు
- వాట్సప్ వేదికగా సాగుకు సలహాలు సూచనలు


డాబాపైన కూరగాయలు

శ్రీకాకుళం డెస్క్: రోజూ ఉదయం లేస్తూనే ఇంట్లో ఈ రోజు ఏం కూర చేయాలి.. బజారుకెళ్లి ఏం తేవాలి? అన్న ఆలోచనతో దాదాపు అన్ని కుటుంబాలు సతమతమవుతుంటాయి. తీరా బజారుకు వెళ్లాక ధరలు చూసి దడ పట్టుకుంటుంది. ఏం కొనేట్టు లేదు.. ఏం తినేట్టు లేదు.. అన్న నిస్సత్తువ ఆవహిస్తుంది. పైగా మార్కెట్లో లభించేవన్నీ రసాయన ఎరువులతో పండించే.. ఆరోగ్యానికి హాని చేసేవే. ఈ ధరల మంట.. ఈ రసాయనాలు బాధ తప్పించే తరుణోపాయమే మిద్దె పంటల సాగు. కూరగాయలు పండించడానికి వ్యవసాయ భూమే ఉండనక్కర్లేదు.. మన ఇంటి మేడపై ఉన్న ఖాళీ స్థలంలోనే ఎంచక్కా కూరగాయలు పండించుకోవచ్చు. వాటినే ఇంట్లో వంటలకు వాడుతూ డబ్బు, ఆరోగ్యం ఆదా చేసుకోవచ్చు. బాగానే ఉంది.. కానీ వీటిని పండించడం ఎలా? అంటారా.. ఆ విషయంలో మార్గదర్శనం చేసేందుకు సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెన్స్ (సీటీజీ) గ్రూప్ ఉండనే ఉంది. వాట్సప్ గ్రూప్ ద్వారానే ఈ సంస్థ స్వచ్ఛందంగా మిద్దె పంటలు పండించే వారికి సలహాలు, సూచనలు అందిస్తోంది. మరింకెందుకు ఆలస్యం.. ఈ సంస్థ సేవలేమిటో తెలుసుకుని.. మనమూ మిద్దె పంటలు పండిద్దాం రండి.


డ్రాగన్ ఫ్రూట్


మొక్కజొన్న కుండీలో


చెర్రీ ఫ్రూట్


పండించిన పసుపు


గోలెంలో చెరకు

ఏమిటీ సీటీజీ..

మనం తినే కూరగాయలను, పండ్లను మనమే డాబాలపై ఎలా పండించుకోవాలనే వివరించాలనే ఉద్దేశంతో ఏర్పడిందే సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెన్స్(సీటీజీ) వాట్సప్ గ్రూప్. ఈ గ్రూప్‌ను హైదరాబాద్‌కు చెందిన శ్రీనివాస హరకార్, సరోజలు ప్రారంభించారు. మన రాష్ట్రంలో ప్రతి జిల్లాకు ఒక గ్రూప్‌ను ఏర్పాటు చేశారు. ఔత్సాహికులను గ్రూప్ అడ్మిన్‌గా నియమించారు. వాట్సప్ వేదికగా దేశవ్యాప్తంగా చాప్టర్ల వారీగా సభ్యులున్నారు. సుమారు 40 వేల మంది ఔత్సాహికులు ఆయా గ్రూపులలో యాక్టివ్‌గా ఉంటూ గార్డెనింగ్‌లో తమ అనుభవాలను తెలియజేస్తుంటారు.

ఏం నేర్పుతారు...

- సీటీజీ వాట్సప్ గ్రూప్‌లలో డాబాలపై కూరగాయలు, పండ్లు, పూల మొక్కలు పెంచడానికి అనువైన సలహాలు, సూచనలు ఇస్తారు.
- అవసరమైతే విత్తనాలను వీరే అందిస్తారు.
- మొక్కల పెంపకంలో సమస్యలు ఎదురైతే వీడియో కాల్, ఫొటోల రూపంలో పరిశీలించి నివారణకు మార్గాలు సూచిస్తారు.
- గ్రూప్‌లో నిత్యం సభ్యులు అందుబాటులో ఉంటారు.

మీరు చేరాలంటే..

మన జిల్లా సీటీజీ వాట్సప్ గ్రూప్‌నకు శ్రీకాకుళం నగరం బ్యాంకర్స్ కాలనీలో నివాసం ఉంటున్న పేర్ల అనురాధ అడ్మిన్‌గా ఉన్నారు. పలాస, టెక్కలి, పర్లాకిమిడి, ఇచ్ఛాపురం, శ్రీకాకుళం ప్రాంతాల నుంచి సుమారు 100 మంది వరకు గ్రూప్‌లో సభ్యులుగా చేరారు. మీరూ ఈ గ్రూప్‌లో చేరాలంటే 95503 45705 నంబరుకు ఫోన్ చేసి మీ ఆసక్తిని వివరిస్తే చాలు. గ్రూప్‌లో యాడ్ చేస్తారు.

ఓర్పు, ఆసక్తి కావాలి..



నేను 'సాక్షి' ఇంటి పంట సభ్యురాలిని. 20 ఏళ్లుగా మొక్కలు పెంచుతున్నాను. మా డాబాపై 8 ఏళ్ల నుంచి కూరగాయలు సాగు చేస్తున్నా. నా భర్త నరేష్ సహకారంతో ఇంట్లో ఉన్న రెండస్తులతో పాటుగా కిందన కూడా కూరగాయలు, పూల మొక్కలతోపాటు ఔషధ, పండ్ల మొక్కలు కూడా పెంచుతున్నా. నేను రెండేళ్ల క్రితం సీటీజీ గ్రూప్ లో చేరా. సీటీజీలో చేరిన తరువాత నేను ఇక్కడ ఒక గ్రూపు తయారు చేశాను. వీలైనంత ఎక్కువ మందిని చేర్పించి వారివారి కూరగాయలు వారే పెంచుకునే విధంగా చేయడమే మా లక్ష్యం. ఏడాదిలో ఒక చక్కనైన ప్రణాళిక ప్రకారం కూరగాయ లు సాగు చేస్తే చాలు. ఇంటి అవసరాలు ఒడ్డెక్కుతాయి. డాబాలపై కూరగాయల పెంపకం చేద్దామనుకునే వారికి ఓపిక, ఓర్పు, ఆసక్తి ఉండాలి.

- జూన్ నుంచి ఆగస్టు వరకు ఎక్కువగా లభ్యమయ్యే బెండ, బీన్సు, కాకర, వంకాయలు, ఆకుకూరలు వంటివి పండిస్తున్నా.
- సెప్టెంబరు నుంచి డిసెంబర్ వరకు బరబట్టి, దోస, గుమ్మడి, చిక్కుళ్లు, బచ్చలి వంటివి సాగు చేస్తున్నా.
- డాబాపైనే ఎత్తుగా ఉండే కుండీలు ఏర్పాటు చేశా. వాటిలో తగినంత మట్టి పోశా. రోజులో కొంత సమయం కేటాయిస్తా.
- సత్యసాయి అన్నపూర్ణ అన్నదాన పథకం కోసం నగరంలోని రిమ్స్ ఆవరణలో ఉన్న ఖాళీ స్థలంలో కూరగాయల మొక్కలు వేసి పెంచాను. నా సేవలకు కేఎల్ యూనివర్సిటీ, ఏరువాక ఫెడరేషన్ వారు బెస్టు టెర్రస్ గార్డినర్‌గా 2019లో అవార్డు అందించి గౌరవించారు.

-పేర్ల అనురాధ

పూలమొక్కలంటే ఇష్టం



పూల మొక్కలు పెంచడం అంటే చాలా ఇష్టం. సీటీజీలో చేరాను. మొక్కలు, కూరగాయల పెంపకంపై మరింత ఆసక్తి పెంచుకున్నా.

-టి.గిరిజా పద్మజ, పర్లాఖిముడి, ఒడిశా

మొక్కల పెంపకం సరదా..



నాకు చిన్నతనం నుంచి మొక్కలు పెంపకం సరదా. నేను డిగ్రీ చదువుతున్నా. మొక్కలే నా నేస్తాలు. గ్రూప్‌లో మంచి సలహాలు అందిస్తున్నారు. ప్రస్తుతం పూల మొక్కలతో పాటు కూరగాయలు, ఆకు కూరలు పెంచుతున్నా.

– బుగత కోమలి, ఇచ్ఛాపురం

మా ఫ్రెండ్ చెప్పారు..



నాకు వ్యవసాయం అంటే చాలా ఇష్టం. వైజాగ్‌లో ఉన్న నా స్నేహితురాలు ఈ గ్రూప్ కోసం చెప్పారు. అరుదైన ఎన్నో రకాల మొక్కల్ని పెంచుతున్నాను. 50 కుండీలలో మొదలు పెట్టా.. ప్రస్తుతం వాటి సంఖ్య 100 దాటింది.

– అన్నపూర్ణ, అడ్వకేట్, సింగుపురం

సేంద్రియ పద్ధతిలో..



ఎరువులు, పురుగు మందుల అవసరం లేకుండా సేంద్రియ పద్ధతిలో కూరగాయలు ఇతర మొక్కల పెంపకాన్ని సీటీజీ గ్రూప్ ద్వారా నేర్చుకున్నా. గ్రూప్ సభ్యుల ద్వారా అవసరమైన మొక్కల్ని కూడా తెచ్చుకుంటున్నా.

– తంగుడు సాయిరాం, అడ్వకేట్, శ్రీకాకుళం

మెలకువలు నేర్చుకున్నా..



మొక్కలంటే నాకు పంచ ప్రాణాలు. మా డాబాపై మొక్కలను పెంచుతున్నాను. ఈ గ్రూపులో చేరిన తరువాత మొక్కల పెంపకంలో మెలకువలు తెలుసుకున్నాను. కొత్తరకాల మొక్కలు ఎక్కడ ఉన్నా వాటిని సేకరించి పెంచుతున్నాను.

– విజయగౌరీ, బ్యాంకర్స్ కాలనీ

క్లుప్తంగా

బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల నిరసన



బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఆవరణలో నిరసన వ్యక్తం చేస్తున్న ఎన్ఎఫ్టీఈ యూనియన్ నాయకులు

విజయనగరం టౌన్: స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఆవరణలో నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ టెలికమ్ ఎంప్లాయీస్ ఆధ్వర్యంలో భోజన విరామ సమయంలో ఉద్యోగులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.భాస్కరరావు, జి. అప్పారావులు మాట్లాడుతూ అఫోర్డ్‌బిలిటి క్లాజ్ నుంచి బీఎస్ఎన్ఎల్‌కు మినహాయింపు ఇవ్వాలని కోరారు. అదేవిధంగా 2017 జనవరి ఒకటో తేదీ నుంచి మూడో వేతన సవరణ అమలుచేయాలని, పెన్షన్ రివిజన్ చేయాలని, అన్ని కేడర్స్ శాంక్షన్ స్ట్రెంత్‌ను సవరించాలని డిమాండ్ చేశారు. నూతన ప్రమోషన్ పాలసీని ఏర్పాటుచేయాలని కోరారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్టీఈ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పాత దుగ్గిలో ఏనుగుల గుంపు



పాత దుగ్గిలో సంచరిస్తున్న ఏనుగులు

కొమరాడ: మండలంలోని పాత దుగ్గి గ్రామానికి ఏనుగుల గుంపు మంగళవారం చేరుకుంది. ఇటీవల జియ్యమ్మవలస మండలంలోని బాసింగి, నిమ్మలపాడు, వెంకటరాజపురం గ్రామ పరిసరాల్లో సంచరించిన ఏనుగుల గుంపు నాగావళి ఇవతలి వైపు చేరుకుంది. దీంతో ఈ ప్రాంత రైతులు ఆందోళన చెందుతున్నారు. రాత్రివేళ పొలాలకు రైతులు వెళ్లవద్దని అటవీశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.

టిఫిన్ షాపు దగ్ధం



అగ్నికి ఆహుతవుతున్న షాపు

శృంగవరపుకోట: మండలంలోని తిమిడి గ్రామంలో మంగళవారం సాయంత్రం జరిగిన అగ్ని ప్రమాదంలో గ్రామానికి చెందిన ఆకుల సంతోష్ టిఫిన్ షాపు దగ్ధమైంది. సాయంత్రం ఆ షాపు సమీపంలో గ్రామస్తులంతా ఉండడంతో వెంటనే మంటలను అదుపు చేశారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పిందని గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

రెండు పశువుల వాహనాల సీజ్



సీఐ చంద్రశేఖర్ పట్టుకున్న పశువుల వ్యాన్‌లు

కొత్తవలస: మండలంలోని చితలదిమ్మ సమీపంలో సీఐ వి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం వాహన తనిఖీలు చేస్తున్న సమయంలో అనుమతులు లేకుండా పశువులను తరలిస్తున్న రెండు వాహనాలను సీజ్ చేశారు. ఈ మేరకు సీఐ మాట్లాడుతూ ఈ పశువులను గజపతినరం ప్రాంతం నుంచి తీసుకొస్తున్నట్లు గుర్తించామని. వ్యాన్‌లలో ఉన్న 23 పశువులను స్థానిక రైతులకు అప్పగించామన్నారు. అనంతరం సంబంధిత వాహన యజమానులపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి గాయాలు



గాయపడిన బాలరాజు



గాయపడిన ఏసురత్నం

వీరఘట్టం: మండలంలోని రేగులపాడు జంక్షన్ వద్ద మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి గాయాలయ్యాయి. ఈ మేరకు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పాలకొండలో జరిగిన టీడీపీ శంఖారావం సభకు వెళ్లిన వీరఘట్టం మండలంలోని గడగమ్మకు చెందిన ఏసురత్నం, బాలరాజుతో పాటు మరో వ్యక్తి ఆటోలో వస్తున్నారు. అదే సమయంలో తెట్టంగి గ్రామానికి చెందిన జయరాజ్‌తో పాటు మరో ఇద్దరు బైక్‌పై వస్తుండగా ఆటో-బైక్ ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఏసురత్నం కుడిభుజం, బాలరాజు తలకు తీవ్ర గాయాలవ్వడంతో వారిద్దరిని శ్రీకాకుళంలోని రిమ్స్‌కు తరలించారు. మిగిలిన వారికి పాలకొండలో ఏరియా ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఈ ప్రమాదంపై ఎస్సై గోవింద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పంటరుణ పరిమితి పెంపు

- వరి, చెరకు, అరటి, పత్తి పంటలకు వర్తింపు
- మన్యం జిల్లాలో 76వేల మంది రైతులకు లబ్ధి

పార్వతీపురం:

సాగు ఖర్చులకు అనుగుణంగా రైతులకు పంటరుణాలు మంజూరు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వ్యవసాయ పెట్టుబడుల కోసం ప్రైవేట్ వ్యాపారులవద్ద రైతులు అధిక వడ్డీకి నగదు తెచ్చి నష్టపోకుండా ఉండేందుకు వీలుగా పంట రుణాల పరిమితిని పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు, బ్యాంకర్లతో కలెక్టర్ నిషాంత్ కుమార్ ఇటీవల సమావేశం నిర్వహించారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వివిధ పంటలకు ఎకరా విస్తీర్ణానికి రుణ పరిమితి (స్కేల్ ఆఫ్ ఫైనాన్స్)పై మార్గదర్శకాలను రూపొందించారు. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని సాంకేతిక కమిటీ ద్వారా రుణపరిమితిని పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. నూతన ప్రతిపాదనల ప్రకారం స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌కు అదనంగా 30 శాతం వరకు పెంచుతూ రుణాలు మంజూరు చేసేలా బ్యాంకర్లు నిర్ణయం తీసుకున్నారు. రుణ పరిమితి పెంపు రానున్న ఖరీఫ్‌నుంచి అమలులోకి రానుంది. అనుబంధ రంగాల రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలు, కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా ఎదగాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్ పిలుపునిచ్చారు.

జిల్లాలో సాగు వివరాలిలా..

పార్వతీపురం మన్యం జిల్లాలోని 15 మండలాలలో ప్రధానమైన వరి పంటను 1.77 వేల ఎకరాల్లో దాదాపు 86 వేల మంది రైతులు సాగుచేస్తున్నారు. అలాగే అరటి పంటను 26వేల ఎకరాలలో, పత్తి పంటను 9వేల ఎకరాలలో, చెరకు పంటను 10 వేల ఎకరాలలో సాగుచేస్తున్నారు. రుణ పరిమితి పెంపు కారణంగా రైతులు ఎవరివద్ద పెట్టుబడులకోసం చేయి చాచకుండా బ్యాంకులనుంచి రుణం పొందేందుకు అవకాశం ఉంది. రుణపరిమితి పెంచుతూ బ్యాంకులు నిర్ణయం తీసుకోవడంవల్ల రైతులకు ఎంతో లాభం చేకూరుతుంది.



బ్యాంకర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్ (ఫైల్)

వివిధ పంటల రుణపరిమితి పెంపు ఇలా..

పంట రకం	గత ఏడాది రుణ సదుపాయం	పెంపు ఇలా..
వరి	రూ. 38వేలు-రూ.42 వేలు	రూ.42వేలు-రూ.45 వేలు
చెరకు(ప్లాంటేషన్)	రూ.77వేలు-రూ.80వేలు	రూ.82వేలు-రూ.85 వేలు
చెరకు(కాంటూన్)	రూ.66వేలు-రూ.70వేలు	రూ.70వేలు-రూ.75వేలు
అరటి(ప్లాంటేషన్)	రూ.65వేలు-రూ.80వేలు	రూ.85వేలు-రూ.95వేలు
అరటి (కాంటూన్)	రూ.45వేలు-రూ.60వేలు	రూ.60వేలు-రూ.75వేలు
జొన్న(సాగునీరున్న ప్రాంతంలో)	రూ.38వేలు-రూ.42వేలు	రూ.45వేలు-రూ.49వేలు
జొన్న(సాగునీరులేని ప్రాంతంలో)	రూ.24వేలు-రూ.26వేలు	రూ.26వేలు-రూ.30వేలు
పత్తి(సాగునీరున్న ప్రాంతంలో)	రూ.40వేలు-రూ.45వేలు	రూ.48వేలు-రూ.52వేలు
పత్తి(సాగునీరు లేని ప్రాంతంలో)	రూ.38వేలు-రూ.42వేలు	రూ.45వేలు-రూ.48వేలు
చోడి(సాగునీరున్న ప్రాంతంలో)	రూ.16వేలు-రూ.20వేలు	రూ.20వేలు-రూ.22వేలు
చోడి(సాగునీరు లేని ప్రాంతంలో)	రూ.16వేలు-18వేలు	రూ.18వేలు-20వేలు

రైతులకు ఉపయోగం



వివిధ రకాల పంటలను సాగుచేసే రైతులకు బ్యాంకులిచ్చే రుణాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. వ్యవసాయ పెట్టుబడులకు అటు ప్రభుత్వం రైతు భరోసాను ఇవ్వగా, బ్యాంకులు పంట రుణాలు ఇవ్వడంతో ఎలాంటి ఆందోళన చెందకుండా వ్యవసాయం చేసుకునేందుకు ఉపయోగపడుతుంది. ప్రభుత్వం, బ్యాంకర్లు కలిసి రైతులను ఆదుకునేందుకు ముందుకు రావడం సంతోషంగా ఉంది.

– బొత్స తాతబాబు, రైతు, నాగూరు

రైతుకు ఆర్థిక భరోసా కల్పించేందుకే..



వ్యవసాయ పెట్టుబడుల కోసం రైతులు ఇతరులపై ఆధారపడకుండా ఉండేలా ఆర్థిక భరోసా కల్పించేందుకు రుణపరిమితిని పెంచుతూ బ్యాంకర్లు ప్రతిపాదనలు చేశారు. రుణపరిమితి పెంపు రానున్న ఖరీఫ్‌నుంచి అమలులోకి వస్తుంది. వ్యవసాయం ఇతర అంశాలను ప్రాతిపదికగా చేసుకుని రుణపరిమితి పెంపు నిర్ణయం తీసుకున్నారు. వ్యవసాయం చేసే రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

– నిషాంత్‌కుమార్, కలెక్టర్, పార్వతీపురం మన్యం జిల్లా

బీసీ స్టేటస్ సాధనే ధ్యేయం

- విజయనగరం జిల్లాకు చేరుకున్న పీవీఆర్ పాదయాత్ర



కోట జంక్షన్ వద్ద మాట్లాడుతున్న తెలగ సంఘం నాయకుడు పీవీఆర్

విజయనగరం టౌన్: బీసీ స్టేటస్ సాధించేవరకూ పోరాటం ఆగదని తెలగ సంఘం ఉత్తరాంధ్రా నాయకుడు పల్లంట్ల వెంకటరామారావు (పీవీఆర్) పేర్కొన్నారు. ఇచ్ఛాపురం నుంచి పాయకరావుపేట వరకూ నిర్వహించ తలపెట్టిన పాదయాత్ర మంగళవారం విజయనగరం చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక కోట జంక్షన్‌కు వందల సంఖ్యలో అభిమానులు, సంఘం నాయకులు వచ్చి ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. క్రేన్‌తో గజమాలను వేసి, అభిమానం చాటుకున్నారు. మహిళలు హారతి పట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయపార్టీలకతీతంగా కులస్తులందరూ ఏకతాటిపై నిలబడాల్సిన సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు. ఏ పార్టీ అయితే తెలగ కులస్తులకు బీసీ స్టేటస్ ఇస్తామని మేనిఫెస్టోలో ప్రకటిస్తుందో ఆ పార్టీకి తమ సహకారమందిస్తామన్నారు. ఎందరో తెలగ కులంలో పుట్టిన బిడ్డలు రిజర్వేషన్లు లేకపోవడంతో చివరి నిమిషం వరకూ పోరాటం చేసి, ఉద్యోగాల్లేక చివరకు ఆత్మహత్యలకు పాల్పడుతున్న సంఘటనలు చూసి, తన మనసు కలిచివేసిందన్నారు. రాజకీయనాయకులు ఇప్పటికైనా తమకు భరోసానివ్వాలని కోరారు. అనంతరం శ్రీపైడితల్లి అమ్మవారిని దర్శించుకుని, ర్యాలీని గంటస్తంభం, వెంకటలక్ష్మి థియేటర్, రైల్వేస్టేషన్ రోడ్డు, మీదుగా నిర్వహించి వై జంక్షన్‌కు చేరుకున్నారు. కార్యక్రమంలో సంఘం నాయకుడు పెద్ది లక్ష్మీనారాయణ, అధిక సంఖ్యలో అభిమానులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

17న పోలిపల్లి పైడితల్లి జాతరకు ముహూర్తపు రాట



పోలిపల్లి పైడితల్లి అమ్మవారు

రాజాం సిటీ: స్థానిక బొబ్బిలి రోడ్డులో వెలసిన పోలిపల్లి పైడితల్లి అమ్మవారి జాతరకు సంబంధించి ముహూర్తపు రాట ఈ నెల 17న ఉదయం 9.45 గంటలకు వేయనున్నామని ఈఓ బీవీ మాధవరావు మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో అనువంశిక ధర్మకర్త వాకచర్ల దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో తొలుత ప్రత్యేక పూజలు జరపనున్నామని పేర్కొన్నారు. మార్చి 17, 18, 19 తేదీల్లో జరగనున్న జాతరకు నెల రోజుల ముందుగా ముహూర్తపు రాట వేసిన అనంతరం జాతర పనులు చేపట్టనున్నామన్నారు. జాతరకు అధిక సంఖ్యలో భక్తులు హాజరుకావాలని ఆయన కోరారు.

శంబరలో బారులు తీరిన భక్తులు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు




పోలమాంబ అమ్మవారు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి నాల్గవ జాతరకు భక్తులు బారులు తీరారు. అధికారుల అంచనాకు మించి భక్తులు తరలివచ్చారు. దీంతో చదురుగుడి, వనంగుడి క్యూలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. మంగళవారం తెల్లవారుజామునుంచి వేలాదిమంది భక్తులు ప్రైవేట్ వాహనాలు, ఆర్టీసీబస్సులు, ట్రాక్టర్లతో శంబర చేరుకున్నారు. తొలుత చదురుగుడిలో కొలువైన పోలమాంబ అమ్మవారిని, అనంతరం వనంగుడిలో ఉన్న పెదపోలమాంబ అమ్మవారిని దర్శించారు. ఆలయం వెనుకన ఉన్న పురాతన వేప చెట్టుకు పూజలు చేశారు. అమ్మవారికి కోళ్లు, మేకలు, చీరలు మొక్కుబడులు చెల్లించి చెట్లకింద వండుకుని కుటుంబసమేతంగా భోజనాలు చేశారు. భక్తులు ఇబ్బందులు పడకుండా ఎస్సై నరసింహమూర్తి, ఈవో వీవీ సూర్యనారాయణ, సిబ్బంది మురళి, కృష్ణ చర్యలు చేపట్టారు.



చదురుగుడి వద్ద క్యూలో వేచిఉన్న భక్తులు

బిందు సేద్యంతో లాభాలు



రామానుజలపేటలో డ్రిప్ ఇరిగేషన్‌ను పరిశీలిస్తున్న పీడీ లక్ష్మీనారాయణ

రాజాం: బిందు, తుంపర సేద్యం పద్ధతులు పాటిస్తే రైతులకు ఎన్నో లాభాలు, ప్రయోజనాలు ఉన్నాయని జిల్లా మైనర్ ఇరిగేషన్ పీడీ పీఎన్వీ లక్ష్మీనారాయణ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన రాజాం మండలంలోని రామానుజులపేట గ్రామంలో రాయితీపై అందించిన పైపులను పరిశీలించడంతో పాటు రైతులు వినియోగించే తీరుపై ఆరాతీశారు. ఆయా గ్రామాల్లోని రైతులకు పైపుల వినియోగం, ప్రభుత్వం అందిస్తున్న రాయితీ గురించి వివరించారు. 5 ఎకరాల్లోపు పంటపొలాలు ఉన్న చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం రాయితీపై, 5 ఎకరాలు దాటిన రైతులకు 50 శాతం రాయితీపై వాటిని అందిస్తున్నామని, ప్రస్తుతం ఈ పథకం ద్వారా లబ్ధిపొందాలనుకునే రైతులు రైతు భరోసా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రాజాం మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి డ్రిప్ ఇరిగేషన్ నిమిత్తం 22 మంది రైతులు దరఖాస్తు చేసుగా, 16.5 హెక్టార్లలో సాగునీటిని అందించేందుకు వారికి రూ.15.23 లక్షల రాయితీతో పైపులు అందజేశామని తెలిపారు. బిందు సేద్యం నిమిత్తం 9 మంది రైతులు దరఖాస్తు చేసుకోగా, వారికి 6.98 హెక్టార్లలో సాగునీటిని అందించేందుకు రూ.1.25 లక్షల రాయితీతో పైపులు అందించినట్లు వివరించారు. రాజాం మండలంలో 40 హెక్టార్లు లక్ష్యంగా చేసుకున్నామని, రైతులు వినియోగించుకోవాలని కోరారు. మామిడి, సపోటా వంటి పండ్ల తోటలతో పాటు పామాయిల్, కూరగాయల సాగుకు వాటిని వినియోగించవచ్చని చెప్పారు. తక్కువ నీటితో ఎక్కువ పంటలు పండించే అవకాశం ఉందన్నారు.

కొత్తవలస రైల్వేస్టేషన్‌లో డీఆర్ఎం

- అభివృద్ధి పనుల పరిశీలన



కొత్తవలస రైల్వేస్టేషన్‌ను పరిశీలిస్తున్న డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్

కొత్తవలస: మండల కేంద్రంలో గల రైల్వేస్టేషన్‌ను వాల్తేర్ డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్ మంగళవారం పరిశీలించారు. అమృత్‌భారత్ పథకంలో భాగంగా చేపట్టిన పలు రకాల పనులను ఈ సందర్భంగా ఆయన పరిశీలించారు.రూ. 22కోట్లతో అదనపు ప్లాట్‌ఫామ్‌లు, ప్రయాణికులకు అనువైన సౌకర్యాల పనులు స్టేషన్‌లో చేపట్టారు.ఈ పనులను సకాలంలో నాణ్యతగా నిర్వహించాలని కాంట్రాక్టర్‌కు ఆయన సూచించారు.అనంతరం మాట్లాడుతూ కొత్తవలస రైల్వేస్టేషన్‌కు రెండో ప్రవేశ ద్వారం త్వరలోనే నిర్మిస్తామని చెప్పారు. అలాగే ఈ స్టేషన్‌లో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిలుపుదల అంశం ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టి చర్యలు తీసుకుంటామన్నారు. అమృతభారత్ పథకంలో చేపట్టిన పనులు ఈ నెలాఖరుకు పూర్తి చేసి ప్రారంభోత్సవం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పలువురు ఇంజినీర్లు, స్టేషన్ మాస్టర్ వై.రాజు తదితరులు పాల్గొన్నారు.

105 మద్యం సీసాలతో ఒకరి అరెస్ట్



మద్యం సీసాలతో వ్యక్తిని అదుపులోకి తీసుకున్న ఏఎస్సై శ్రీనివాసరావు, పోలీసు సిబ్బంది

సీతానగరం: పోలీస్ ఉన్నతాధికారుల సూచనలమేరకు ఎస్సై ఎం. రాజేష్ ఆధ్వర్యంలో మంగళవారం సీతానగరం మండలంలోని పలుగ్రామాల రహదారుల్లో వాహనాలు, గ్రామాల్లో షాపులు తనిఖీని పోలీసులు చేపట్టారు. ఈ సందర్భంగా ఏఎస్సై జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ స్థానిక శివాలయం నుంచి బూర్జ వరకూ సిబ్బంది సహకారంతో వాహనాల తనిఖీతో పాటు, కిరాణాషాపులను సోదా చేసిన సమయంలో లక్ష్మీపురంలో కిరాణాషాపు తనిఖీ చేయగా 105 మద్యం సీసాలు పట్టుబడ్డాయని చెప్పారు. అనంతరం మద్యం విక్రయాలు చేస్తున్న వ్యక్తిని గుర్తించి అదుపులోకి తీసుకు న్నామన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, మద్యం సీసాలను సీజ్ చేసినట్లు చెప్పారు.

రేగలో 120 మద్యం సీసాలు..

లక్కవరపుకోట: మండలంలోని రేగ గ్రామంలో కె.నారాయణ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 120 మద్యం సీసాలను గుర్తించి సీజ్ చేసినట్లు ఎస్సై ఆర్.గోపాలరావు మంగళవారం తెలిపారు.అజ్ఞాత వ్యక్తి ఇచ్చిన సమాచారం మేరకు గ్రామంలో తనిఖీలు నిర్వహించగా పట్టుబడిన మద్యం సీసాలను సీజ్ చేసి నిందితుడు నారాయణపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పైడితల్లికి పుష్పాలంకరణ



ప్రత్యేక పుష్పాలంకరణలో పైడితల్లి అమ్మవారు



దర్శించుకుంటున్న భక్తులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం, కోరిన కోర్కెలు తీర్చే కలవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, మూలా పాపారావులు శాస్త్రోక్తంగా నిత్య పూజాదికాలు చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి, పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారిణి కేఎల్.సుధారాణి కార్యక్రమాలను పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి, తరించారు.

జేఈఈ మెయిన్స్‌లో సత్తా



శశాంక్



మాధవరావు



ధనుకొండ శ్రీనిధి



జంకాల చైతన్య



రొంగలి లీలా పవన్



కె.ఉపేంద్ర



గేదెల చైతన్య



ఆరిక ప్రశాంత్



షణ్ముఖ సాయినాథ్



సవర స్రవంతి



బి. ఫ్రాన్సిస్



ఎస్.అభి

రామభద్రపురం: జేఈఈ మెయిన్స్ సెషన్-1 ఫలితాల్లో ఉమ్మడి విజయనగరం జిల్లా విద్యార్థులు పలువురు సత్తా చాటారు. వివరాలిలా ఉన్నాయి. రామభద్రపురం మండలకేంద్రానికి చెందిన తెర్లి శశాంక్ సత్తా చాటాడు. మంగళవారం విడుదలైన ఫలితాల్లో 300 మార్కులకు గాను 245 మార్కులు సాధించాడు. ఫిజిక్స్ 99.72 శాతం, కెమిస్ట్రీ 99.23 శాతం, మ్యాథ్స్ 99.63 శాతం ర్యాండమ్‌గా 99.74 శాతం మార్కులతో ప్రతిభ చాటుకున్నాడు. శశాంక్ తండ్రి శ్రీనివాసరావు శ్రీరామ్ చిట్‌ఫండ్ కంపెనీలో పనిచేస్తుండగా తల్లి పద్మ ఉపాధ్యాయిని. జేఈఈ మెయిన్స్‌లో సత్తా చాటిన శశాంక్‌ను తల్లిదండ్రులతో పాటు, మిత్రులు ,గ్రామ పెద్దలు అభినందించారు.

మాధవరావుకు 290/300

గజపతినగరం: మండలంలోని పురిటిపెంట మండల వారి కాలనీలో నివాసం ఉంటున్న దాకి అప్పలనాయుడు, తులసీమాధవి దంపతుల కుమారుడు మాధవరావు 2024 జేఈఈ మెయిన్స్ సెషన్-1 ఫలితాల్లో సత్తా చాటాడు. ఈ పరీక్షలో 290 మార్కులు(300కు) సాధించి ఉత్తరాంధ్రలో ప్రథమ స్థానంలో నిలిచాడు. ప్రస్తుతం విశాఖపట్నంలోని నారాయణ కళాశాలలో ఇంటర్‌మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు.

విజయనగరంలో మరో ముగ్గురు..

విజయనగరం అర్బన్: ప్రతిష్టాత్మక ఐఐటీ కళాశాలల్లో ప్రవేశాలకు ఇటీవల చేపట్టిన జేఈఈ మెయిన్స్ ప్రవేశపరీక్షలో విజయనగరం విద్యార్థులు ప్రతిభ చూపారు. పట్టణంలోని వివిధ కళాశాలల్లో ఇంటర్‌మీడియట్ చదువుతున్న ధనుకొండ శ్రీనిధి 99.99 పర్సంటైల్, జంకాల చైతన్య 98.71, రొంగలి లీలా పవన్ 96.85 పర్సంటైల్ సాధించారు.

ఎస్.కోటలో సాయినాథ్

శృంగవరపుకోట: పట్టణానికి చెందిన పీల షణ్ముఖ సాయినాథ్ ఓబీసీ కేటగిరిలో ఫిజిక్స్‌లో 99.77, కెమిస్ట్రీలో 99.96 మ్యాథ్స్‌లో 99.73, మొత్తంగా 99.90,78,459 పర్సంటైల్ సాధించాడు.

20 మంది గిరిజన విద్యార్థుల ప్రతిభ

సీతంపేట: సీతంపేట ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీకాకుళం వైటీసీ సూపర్ 60 కోచింగ్ సెంటర్‌లో శిక్షణ పొందిన 20 మంది గిరిజన విద్యార్థులు జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ చాటినట్లు ఐటీడీఏ పీవో కల్పనాకుమారి, ప్రిన్సిపాల్ బి.మురళీబాబులు ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 30 మంది ఇక్కడి నుంచి జేఈఈ మెయిన్స్‌కు హాజరయ్యారు. వారిలో కె.ఉపేంద్ర 88.98 శాతం, గేదెల చైతన్య 87.14, ఆరిక ప్రశాంత్ 83.96, సవర స్రవంతి 78.07, బిడ్డిక ఫ్రాన్సిస్ 75.79, సవర అభి 71.50 పర్సంటైల్ సాధించారు. కోచింగ్ ప్రారంభించిన ఐదునెలల్లోనే ఉత్తమ ఫలితాలు సాధించినందుకు విద్యార్థులను, ఫ్యాకల్టీ కిరణ్‌కుమార్, శ్రీకాంత్, వసంతకుమార్, ప్రభాకర్, కేర్‌టేకర్ కె.శ్రీనివాసరావు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ రాంబాబులను పీఓ అభినందించారు.

గురుకుల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లిమర్ల: ఉమ్మడి విజయనగరం జిల్లాలోని మహాత్మ జ్యోతిబా పూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ పాఠశాలల కన్వీనర్ రమా మోహిని తెలిపారు. నెల్లిమర్ల ఎంజేపీ బీసీ రెసిడెన్షియల్ స్కూల్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. 2024-25 విద్యా సంవత్సరంలో 5 వ తరగతిలో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నెల్లిమర్ల, గంట్యాడ, కొత్తవలస, సాలూరు, పార్వతీపురం బాలికల పాఠశాలల్లో 320 సీట్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. విజయనగరం, నెల్లిమర్ల, గజపతినగరం, బొబ్బిలి, కురుపాం బాలుర పాఠశాలల్లో మరో 320 సీట్లు అందుబాటులో ఉన్నట్టు వెల్లడించారు. వీటిలో నెల్లిమర్ల బాలుర పాఠశాలల్లో మత్స్యకార బాలురకు ప్రవేశాలు కల్పిస్తామన్నారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు 2022-23, 2023-24 సంవత్సరాల్లో ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో నిరంతరాయంగా 3, 4వ తరగతులు చదువుతూ ఉండాలన్నారు. మార్చి 1 నుంచి 31వ తేదీ వరకు దరఖాస్తులు ఆన్‌లైన్లో స్వీకరిస్తామని కన్వీనర్ చెప్పారు. విద్యార్థులు వారి సొంత జిల్లాలోనే ప్రవేశ పరీక్ష రాసేందుకు కేంద్రాన్ని ఎంపిక చేసుకోవాలని సూచించారు. 'విద్యార్థులు' అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని రమా మోహిని తెలిపారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. వివరాలకు సమీప పాఠశాలల్లోని కార్యాలయాలను సంప్రదించాలని ఆమె సూచించారు.

అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు

పార్వతీపురం: అనుమతులు లేకుండా ఇసుకు తరలిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ నిషాంత్‌కుమార్ హెచ్చరించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీంకోర్టు గ్రీన్ ట్రిబునల్ ఆదేశాల మేరకు పర్యావరణ అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు జరపకూడదన్నారు. అనుమతులు పొందిన రీచ్‌లలో కూడా పర్యావరణానికి సంబంధించిన అన్ని అనుమతులు పొందిన తరువాత మాత్రమే ఇసుక తవ్వకాలు జరపాలన్నారు. జనవరి 4న జిల్లాలో నాలుగు రీచ్‌లకు అనుమతులు ఇచ్చామమన్నారు. జిల్లాలో నదీ పరివాహక ప్రాంతాలు ఎక్కువగా ఉన్నాయని, వాటిని నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ఇసుక అక్రమ రవాణాకు సంబంధించి 2023లో 50 కేసులు, ఈ ఏడాది ఇంతవరకు రెండు కేసులు నమోదు చేసినట్టు వెల్లడించారు. సమావేశంలో జేసీ ఆర్.గోవిందరావు, ఇన్‌చార్జి డీఆర్వో జి.కేశవనాయుడు, ఆర్డీఓ సి.మల్లికార్జునరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తనిఖీలు పెంచాలి

సాధారణ ఎన్నికల నేపథ్యంలో గంజాయి, మద్యం, డ్రగ్స్, నగదు రవాణాను నిరోధించేందుకు తనిఖీలు పెంచాలని కలెక్టర్ నిషాంత్ కుమార్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం జరిగిన నార్కో కోఆర్డినేషన్ సెంటర్ జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదక ద్రవ్యాల నిరోధంపై పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ జిల్లాలో మూడు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో జేసీ ఆర్.గోవిందరావు, డీఎఫ్ఓ జి.ప్రసూన, డీఎంహెచ్ఓ బి.జగన్నాథం పాల్గొన్నారు.